

ఏసిబి వలలో హాస్టల్ వార్డెన్

లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన వైనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలో ఎంప్లాయీస్ కాలనీలో గురువారం రాత్రి ఏసిబి రైడింగ్ తీవ్ర సంచలనం రేపింది. సోషల్ వెల్ఫేర్ బాలికల కాలేజీ హాస్టల్ వార్డెన్ నాగమణి రూ.30 వేల నగదు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. హాస్టల్లో స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ర్యూబీ అనే ఉద్యోగి నుంచి వార్డెన్ లంచం డిమాండ్ చేయగా ర్యూబీ ఏలూరు ఏసిబిని ఆశ్రయించింది. దీంతో వార్డెన్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసిబి డిఎస్‌పి సుబ్బరాజు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఈ కేసు దర్యాప్తులో ఏలూరు ఏసిబి సిఐ ఎం.బాలకృష్ణ, కె.శ్రీనివాస్, రాజమండ్రి సిఐ ఎస్‌వి.భాస్కరరావు పాల్గొన్నారు.



కేంద్రం పద్దు పలికేనా..!

- పోలవరం పునరావాసానికి నిధులిచ్చేనా
- కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌కు మోక్షం లభించేనా
- మద్దతు ధరల గ్యారెంటీ చట్టం మాటేమిటో
- ఆదాయపు పన్ను పరిమితిపై వేతన జీవుల ఎదురుచూపు
- నేడు పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల కన్నీటి వ్యధలు.. వేతన జీవుల ఆదాయపు పన్ను కష్టాలు, కర్షకుల కన్నీటి వేదనను కేంద్ర ప్రభుత్వం గుర్తిస్తుందా.. కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్లకు సంబంధించి శనివారం ప్రవేశ పెట్టబోయే కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారా.. జరిగేనా అంటూ జిల్లా ప్రజానీకంలో విస్తృత చర్చ సాగుతోంది. కేంద్రంలో మోదీ సర్కార్ నిలబడేందుకు ఆక్సిజన్‌గా రాష్ట్రంలోని టిడిపి ఎంపీలు ఉన్నారు. జిల్లాకు చెందిన బిజెపి ఎంపీ కేంద్రమంత్రిగా సైతం ఉన్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని కేంద్ర ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారా.. ఇక్కడి రైతులకు ఊరట కలిగించే అంశాలు ఉంటాయని అంతా గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. మోదీ సర్కార్ ఏం చేస్తుందో శనివారం తేలిపోనుంది.

కేంద్ర ప్రభుత్వం శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న 2025-26 బడ్జెట్‌లో జిల్లాలోని కేంద్ర పరిధిలోని ప్రాజెక్టులకు, వ్యవసాయ, ఆక్వా రంగాలకు సంబంధించి కేటాయింపులపై ఇప్పటికే ప్రజానీకంలో గంపెడాశలు ఉన్నాయి. ముఖ్యమైన పోలవరం నిర్వాసితుల సమస్య కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 20 వేలకుపైగా నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. కేంద్రంలో ఎన్‌డిఎ మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పోలవరానికి దాదాపు రూ.12 వేల కోట్లు కేటాయించినట్లు కేంద్రం ప్రకటించింది. అందులో నిర్వాసితులకు కేవలం పునరావాస ప్యాకేజీ కింద రూ.రెండు వేల కోట్లు మాత్రమే కేటాయించింది. ఇంకా ఇంటి వాల్యూయేషన్, భూములకు సంబంధించిన సొమ్ము, కాలనీల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. ఉమ్మడి, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని పోలవరం నిర్వాసితులకు పరిహారం కింద రూ.30 వేల కోట్లకు పైగా ఖర్చవుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసి కేంద్రానికి పంపించింది. ఇటీవల నిర్వాసితులకు జమ చేసిన సొమ్ము కేవలం రూ.రెండు వేల కోట్లు మాత్రమే ఉంది. ఏలూరు జిల్లాలో దాదాపు రూ.250 కోట్లు వరకూ మాత్రమే వచ్చిన పరిస్థితి. 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాలకు మాత్రమే ముందుగా సొమ్ములిస్తామని చెబుతున్నారు. 2022లో వచ్చిన వరదలతో కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా గ్రామాలన్నీ ముంపునకు గురయ్యాయి. దీంతో నిర్వాసితులందరికీ పూర్తిస్థాయిలో పరిహారం ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. ఈ బడ్జెట్‌లో పోలవరం నిర్వాసితులకు నిధులు కేటాయిస్తారో, లేదో వేచిచూడాలి.

రైల్వేలైన్లకు మోక్షం కలిగేనా?

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రధానమైన రైల్వే ప్రాజెక్టులు రెండు ఉన్నాయి. కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్ అనేది దశాబ్దాల కలగానే ఉంది. కొవ్వూరు నుంచి భద్రాచలం వరకూ 151 కిలోమీటర్ల మేర ఈ రైల్వేలైన్ ప్రతిపాదన జరిగింది. 2013లో పూర్తిస్థాయిలో తెరపైకి వచ్చింది. దీనిపై సర్వే చేసి రూ.2,200 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు సైతం రూపొందించారు. అప్పటి నుంచి రూ.కోటి, రెండు కోట్లు నిధులు కేటాయించడం తప్ప రైల్వేలైన్ ముందుకు సాగేలా నిధుల కేటాయింపులు లేకుండాపోయాయి. ఈ రైల్వేలైన్ నిర్మాణం జరిగితే ఏజెన్సీ, మెట్ట ప్రాంతానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఏజెన్సీ ప్రాంతంలో పండే ఉత్పత్తుల చేరవేతకు మార్గం సుగమంగా ఉంటుంది. ఇటీవల కాలంలో ఈప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తున్నట్లు కేంద్రంలోని మంత్రులు చెప్పారు. బడ్జెట్‌లో నిధులు కేటాయింపు ఉంటుందో, లేదో చూడాలి. కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ పనులకు కొద్దిమేర నిధులు కేటాయించడం తప్ప వేగంగా పనులు ముందుకు సాగిన పరిస్థితి లేదు. ఈ బడ్జెట్‌లోనైనా పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తారా అనే చర్చ సాగుతోంది. అదేవిధంగా కేంద్ర విద్యాసంస్థ తాడేపల్లిగూడెంలోని నిట్ పనులు ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదు. నిధులు కేటాయింపు పెద్దఎత్తున సాగితే పనులు త్వరితగతిన ముందుకు సాగే అవకాశం ఉంది.

మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేసేనా?

జిల్లాలో 80 శాతానికిపైగా ప్రజలు వ్యవసాయమే జీవనాధారం. వరి, మొక్కజొన్న, పామాయిల్, మామిడి, పత్తి వంటి అనేక పంటలను రైతులు పండిస్తున్నారు. పండిన పంటలకు సరైన ధర దక్కక రైతులు వ్యవసాయం నుంచి తప్పుకుంటున్న పరిస్థితి ఉంది. పండించిన పంటలకు వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని రైతులు కోరుతున్నారు. ఏళ్ల తరబడి ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు పోరాటం చేస్తున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేస్తారో, లేదో చూడాలి. ఆక్వాకు సరైన ధర లేక, మేత ధరలు పెరిగిపోయి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఆక్వారైతులకు ఊరట కలిగించే అంశాలు బడ్జెట్‌లో ఉంటాయని ఆక్వా రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆదాయపు పన్ను పరిమితిపై వేతన జీవులకు ఊరట కలిగేనా?

ఉద్యోగులకు ఆదాయపు పన్ను పరిమితి రూ.2.50 లక్షల నుంచి రూ.ఐదులక్షలకుపైగా పెంచాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఈ శ్లాబ్ నిర్ణయించి దశాబ్దకాలం గడిచిపోయింది. ఈ కాలంలో ధరల పెరుగుదల నుంచి ఎన్నో మార్పులు జరిగినా ఆదాయ పన్నుపై మాత్రం మార్పులు లేకుండాపోయాయి. ఈ బడ్జెట్‌లోనైనా తమ కోరిక నెరవేరుతుందా అని వేతన జీవులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రానున్న కాలంలో బిసిలకు పెద్దపీట

పెనుగొండలో సిఎం చంద్రబాబు


వాసవీ మాత ఆలయంలో పూజలు, పట్టువస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, పెనుగొండ, ఆచంట

రానున్న కాలంలో బిసిలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేయనుందని సిఎం చంద్రబాబు తెలిపారు. బిసిలను రాజకీయంగా పైకి తీసుకొచ్చిన ఘనత టిడిపిదేనన్నారు. శుక్రవారం పెనుగొండలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయానికి విచ్చేసిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత ఆలయ అధికారులు, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. గురుపీఠం నిర్మాణానికి సిఎం శంకుస్థాపన చేశారు. చంద్రబాబు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఆర్య వైశ్యులు నీతి, నిజాయితీలతో వ్యాపారం చేస్తారని, ఆదాయంలో కొంత ప్రజాసేవకు వినియోగిస్తారని ప్రశంసించారు. అనంతరం మార్కెట్ యార్డు ఆవరణలో బిసిలైన శెట్టిబలిజ, గౌడ, ఇతర ఉపకులాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తొలుత వినతిపత్రాలు స్వీకరించారు. బిసిలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత టిడిపిదేనన్నారు. గీత కులాల వారికి మద్యం షాపుల్లో పది శాతం కేటాయించామని, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం సబ్సిడీ అందించామన్నారు.

ఎయిడెడ్ కాలేజీ సిబ్బంది జీతం స్కేల్‌పై వినతి

ఎస్‌వికెపి కాలేజీలో ఎయిడెడ్ పోస్టులు భర్తీ చేయాలని, అన్‌ఎయిడెడ్ కాలేజీలో పని చేస్తున్న సిబ్బందికి జీతం స్కేల్ వర్తింపజేయాలని ఎస్‌వికెపి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కెవి.సూర్యనారాయణ, కళాశాల సిబ్బంది చంద్రబాబుకు వినతిపత్రం అందించారు. జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందించాలని, ప్రతిభ పురస్కారాలకు ఎంపిక చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సిఎం పర్యటన సాగిందిలా..

ముఖ్యమంత్రి చంద్రబాబు పెనుగొండ ఎఎంసిలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు ఉదయం 11:53 గంటలకు చేరుకున్నారు. అనంతరం అక్కడ నుంచి రోడ్డు మార్గాన ప్రజలకు అభివాదం చేస్తూ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం 1:55 గంటలకు తిరిగి ఎఎంసి కార్యాలయానికి చేరుకున్నారు. హెలికాప్టర్‌లో బయల్దేరి వెళ్లారు. కూటమి నేతలను ఆయన దగ్గరికి అనుమతించకపోవడంతో వారు నిరాశకు గురయ్యారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, టిజి.భరత్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎంఎల్‌ఎలు పితాని సత్యనారాయణ, పులపర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, ఆరిమిల్లి రాధాకృష్ణ, రామరాజగోపాల్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఎపి ఎస్‌సిపిసి ఛైర్‌పర్సన్ పీతల సుజాత, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, మాజీ ఎంఎల్‌ఎలు బండారు మాధవనాయుడు, ముళ్లపూడి వెంకటకృష్ణారావు, సర్పంచి నక్కా శ్యామల సోనీ, దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు, ఆర్యవైశ్య నేతలు పాల్గొన్నారు.

హై రిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించాలి

వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి : కలెక్టర్ కె.వెట్రిసెల్వి



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పేదలకు సకాలంలో నూరుశాతం నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి డిఎంహెచ్‌ఒ మాలిని, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్, ఎన్‌టిఆర్ వైద్యసేవల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్‌తో కలిసి వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణుల నమోదు, ఎన్‌సిడి, ఆర్‌బిఎస్‌కె, ప్రసవాలు, వెక్టార్ బోర్న్ వ్యాధుల నివారణ, ఎన్‌టిఆర్ వైద్యసేవా, ఇమ్యూనైజేషన్, కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమం తదితర అంశాలపై సమీక్షించి ఆయా వైద్య ఆరోగ్య అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సేవలు మరింత మెరుగుపర్చడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భం దాల్చిన ప్రతి గర్భిణీ వివరాలను ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది ద్వారా సేకరించి రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. హైరిస్క్ గర్భిణులకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఆయా వైద్యాధికారుల పరిధిలోని ప్రాంతాల్లో గర్భిణులు అంతా సంబంధిత యాప్‌లో నమోదైనట్లు మెడికల్ ఆఫీసర్ ధ్రువీకరించాల్సి ఉందన్నారు. కేన్సర్ నిర్ధారణ పరిశీలన కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. కొన్ని పిహెచ్‌సిలు సర్వే ప్రగతిలో ఇంకా వెనుకబడి ఉన్నాయని, దీనికి గల కారణాలపై సంబంధిత పిహెచ్‌సి వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆర్‌బిఎస్‌కె కింద ప్రతి గురు, శనివారం విద్యార్థులకు వైద్య పరీక్షలకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. ఆసుపత్రిలో ప్రసవాలపై శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో నూరు శాతం ఇమ్యూనేజేషన్ జరగాలన్నారు. ప్రజలకు వైద్యసేవలు మరింత మెరుగ్గా అందించేందుకు సమయపాలన ఎంతో ముఖ్యమన్నారు. ఇకనుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరును పరిశీలిస్తామని, కచ్చితంగా వైద్య సిబ్బంది ఆయా ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఏరియా, సిహెచ్‌సి, పిహెచ్‌సి వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో భూ సమస్యలు పరిష్కరించాలి

గుడిసెలు పీకేసిన వారిపై చర్యలు తీసుకోండి

తప్పుడు ప్రొటెక్షన్ ఆర్డర్లు రద్దు చేయాలి

జెసికి సిపిఎం జిల్లా బృందం వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏజెన్సీ ప్రాంతంలో భూసమస్యలను పరిష్కరించాలని, బుట్టాయగూడెంలో గిరిజనులు వేసుకున్న గుడిసెలను పీకేసిన ప్రయివేటు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ అధికారుల తప్పుడు ప్రొటెక్షన్ ఆర్డర్లను రద్దు చేయాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ బృందం శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ బృందంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, డిఎన్‌విడి.ప్రసాద్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో గిరిజనుల భూసమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారుల వైఖరి వల్ల గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రత్యేకించి బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ఇనుమూరు, మర్లగూడెం, జైనవారిగూడెం, సిరివారిగూడెం గ్రామాల్లో రెవెన్యూ అధికారులు భూసమస్యల్లో గిరిజనులకు వ్యతిరేకంగా గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా తప్పుడు ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇస్తున్నారని తెలిపారు. గిరిజనుల హక్కులు దెబ్బతీస్తూ గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎస్‌డిసి కోర్టు తీర్పులు గిరిజనులకు అనుకూలంగా ఉన్నవాటికి కూడా ఈ రెవెన్యూ అధికారులు గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పోరంబోకు భూములకు కూడా ఇస్తున్నారని అన్నారు. ఇటువంటి తప్పుడు ఆర్డర్లు ఇస్తున్న బుట్టాయగూడెం, జీలుగుమిల్లి తహశీల్దార్లపైనా, గతంలో ఆర్డర్లు ఇచ్చిన జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ అధికారులకు గిరిజనేతర భూస్వాములు ఇస్తున్న లంచాలకు కక్కుర్తిపడి రెవెన్యూ అధికారులు ఇస్తున్న ప్రొటెక్షన్ ఆర్డర్లను రద్దు చేయాలని, ఉభయుల సమక్షంలో టైటిల్ డీడ్ లింక్ డాక్యుమెంట్లు ఆధారంగా పరిశీలించి తగు నిర్ణయం తీసుకునేలా రెవెన్యూ అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. దీనిలో పోలీసుల జోక్యం కూడా ఉండరాదని, గిరిజనులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



జెసికి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

దీనిపై జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి స్పందిస్తూ ప్రొటెక్షన్ ఆర్డర్లు, భూవివాదాలపై సమగ్ర పరిశీలన చేస్తామని, దీనిపై ఏజెన్సీ మండలాల తహశీల్దార్లతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

సిపిఎం నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోం

ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి హెచ్చరిక

బుట్టాయగూడెం రెవెన్యూలో ఉన్న ఆర్‌ఎస్ నెం.550/5, 6లో ప్రభుత్వ పోరంబోకు భూములు ఉన్నాయని, అందులో ఇళ్లు లేని గిరిజనులు గుడిసెలు వేసుకుని ఉన్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి రవి తెలిపారు. ఈ గుడిసెలను ఇంతకు ముందు స్థానిక తహశీల్దార్ దౌర్జన్యంగా పీకాలని చూస్తే సిపిఎం నాయకులు ఇవి ప్రభుత్వ భూములని, ఇళ్లు లేని గిరిజనులు గుడిసెలు వేసుకున్నారని నిరసన తెలిపారు. గురువారం నాడు కొందరు ప్రయివేటు వ్యక్తులు జెసిబిలతో వచ్చి పీకేశారని, అడ్డువచ్చిన గిరిజన మహిళలపై కూడా దౌర్జన్యం చేశారని అన్నారు. కరాటం సునీల్ అనే భూస్వామి కొంతమంది కిరాయి వ్యక్తులను తీసుకొచ్చి ఈ దారుణానికి పాల్పడ్డాడని ఆరోపించారు. గిరిజనుల పక్షంగా ఉండి, వారి హక్కుల కోసం పోరాటం చేస్తున్న సిపిఎం బుట్టాయగూడెం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణపై రౌడీషీట్ పెట్టాలంటూ కరాటం సునీల్ మనుషులు సిపిఎంపై, నాయకులపై దుర్మార్గమైన, అసత్యమైన ఆరోపణలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సిపిఎంపైనగాని, నాయకులపైనగాని ఇలాంటి ఆరోపణలు, దౌర్జన్యాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని రవి హెచ్చరించారు. వీరిపై రెవెన్యూ, పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలిస్తాం

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వి.శంకర్‌నాయక్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెంలో గురువారం జరిగిన భూ తగాదాల్లో సిపిఎం మండలాధ్యక్షుడు తెల్లం రామకృష్ణ అరెస్ట్ నేపథ్యంలో సిపిఎం నేతలను రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వి.శంకర్‌నాయక్ శుక్రవారం కలుసుకుని సమస్యను అడిగి తెలుసుకున్నారు. పాకలు వేసుకున్న గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ ఎస్‌టి కమిషన్ సభ్యులకు వివరించారు. శంకర్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఎంత ఉందో బయటకు తీసి ఇల్లు లేని గిరిజనులకు ఇవ్వాలని తహశీల్దార్ చలపతిరావును ఆదేశించారు. ఇల్లు లేని పేదలందరికీ ఇంటి స్థలాలు ఇచ్చేటట్టు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రెవెన్యూ విషయాల్లో పోలీసు వారు జోక్యం చేసుకోవద్దన్నారు. ఆయనతో పాటు ఐటిడిఎ ఎపిఒ నాయుడు, ఎస్‌ఐ డి.దుర్గామహేశ్వరరావు, మండల రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గంగరాజు ఉన్నారు.



సిపిఎం నేతలతో, పేదలతో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

పోలవరం : మండలంలోని జిల్లెల్లగూడెం పంచాయతీ రెడ్డి కుంకాల గ్రామంలో పర్యటించి స్థానిక గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తొలుత కుంకాల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు, అధికారులు ఎస్‌టి కమిషన్ సభ్యునికి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి సన్మానం నిర్వహించారు. అనంతరం స్థానిక గిరిజనులతో సమావేశం నిర్వహించి సమస్యలపై పరిష్కారాలు సత్వరమే చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

శంకర్‌నాయక్ దృష్టికి గిరిజనుల సమస్యలు

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన విద్యాసంస్థల్లోని సమస్యలు, ఆదివాసీ భూ సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం భాస్కర్ కోరారు. రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వి.సోముశంకర్‌నాయక్ మండలంలోని కుంకాల, రెడ్డి కుంకాల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం తరపున పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. సమస్యలపై ఎస్‌టి కమిషన్ సభ్యులు వి.శంకర్‌నాయక్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదిక అందిస్తానని తెలిపారు.

వైఎంహెచ్‌ఎ హాలు ప్రారంభం

ఆధునికీకరణకు కృషిచేసినవారికి అభినందనలు

ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

హేలాపురి కళాచరిత్రకు తలమానికంగా నిలుస్తున్న వైఎంహెచ్‌ఎ హాల్ ఆధునీకరణకు కృషి చేసినవారందరికీ ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి శుభాభినందనలు తెలిపారు. హేలాపురి ఘన చరిత్రకు నిలువెత్తు రూపంగా నిలిచిన ఏలూరు అగ్రహారంలోని వైఎంహెచ్‌ఎ హాల్ ఆధునీకరణ పనులను హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో శరవేగంగా పూర్తి చేశారు. దీంతో అధునాతన హంగులతో పాటు ఎసి హాలుగా మార్పు చెందిన వైఎంహెచ్‌ఎ హాలును ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్‌లు శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ఆధునీకరించిన హాల్‌లో తొలి కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఒక కార్యక్రమం దిగ్విజయంగా పూర్తికావాలంటే దాతల సహకారం అత్యంత కీలకమన్నారు. కళలను కాపాడేందుకు ఉప యుక్తంగా నిలిచిన వైఎంహెచ్‌ఎ హాలు ఆధునీకరణకు కృషి చేసిన వారందరికీ ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చంటి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని తొలుత వైఎంహెచ్‌ఎ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి హోమ కార్యక్రమాల్లో ప్రముఖ పారిశ్రామిక వేత్త మడుపల్లి మోహన్ గుప్తా, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, నగర ప్రముఖులు కెకె.గుప్తా, వేణుగోపాల్ లునాని, డాక్టర్ వివి.బాలకృష్ణారావు, హనుమంతరావు, అంబికా ప్రసాద్, డాక్టర్ గుడిపాటి లలితా శర్మ, కో - ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు, వైఎంహెచ్‌ఎ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కెవి.సత్యనారాయణ, వైఎంహెచ్‌ఎ ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



వైఎంహెచ్‌ఎ హాలు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

ఎస్‌ఐ ఆత్మహత్యతో కలకలం..!


కారణాలపై పలు ఊహాగానాలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

రివాల్వర్‌తో కాల్చుకుని ఎస్‌ఐ ఆత్మహత్యకు పాల్పడటం పశ్చిమగోదావరి జిల్లాలో తీవ్ర కలకలం సృష్టించింది. పోలీసు అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి గురవ్వగా తణుకు పరిసర ప్రాంతాల్లో కలకలం రేపింది. వివరాల్లోకెళ్తే తణుకు రూరల్ ఎస్‌ఐగా ఎజిఎస్.మూర్తి (38) పని చేస్తున్న సమయంలో గేదెల అపహరణ కేసులో ఆరోపణలు వచ్చాయి. దీంతో గతేడాది నవంబర్‌లో ఉన్నతాధికారులు విచారణ జరిపి ఎస్‌ఐను విఆర్‌కు పంపారు. శుక్రవారం పెనుగొండలో సిఎం బందోబస్తు విధులకు హాజరయ్యేందుకు భీమవరంలో రివాల్వర్ తీసుకుని గురువారం రాత్రి తణుకు సమీపంలోని పైడిపర్రులో ఉన్న ఇంటికొచ్చారు. శుక్రవారం ఉదయం తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఎస్‌ఐ మూర్తి వాష్‌రూమ్‌కు వెళ్లొస్తా అని చెప్పి వెళ్లారు. తనతో తెచ్చుకున్న సర్వీస్ రివాల్వర్‌తో పాయింట్ బ్లాంక్‌లో షూట్ చేసుకున్నారు. పెద్ద శబ్దం రావడంతో స్టేషన్లోని పోలీస్ సిబ్బంది అక్కడికెళ్లగా ఎస్‌ఐ రక్తపుమడుగులో పడి ఉన్నారు. సిబ్బంది హుటాహుటీన ఎస్‌ఐ మూర్తిని 108 వాహనంలో తణుకు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరానికి చెందిన ఎజిఎస్.మూర్తి 2012 బ్యాచ్‌లో ఎస్‌ఐగా విధుల్లో చేరి కృష్ణా జిల్లాలో మొదట పోస్టింగ్ తీసుకున్నారు. అనంతరం భీమవరం ట్రాఫిక్, పెరవలి, ఆచంట, తణుకు రూరల్ పోలీస్ స్టేషన్లలో పని చేశారు. ఆయనకు భార్య విజయ, కుమారుడు చందన్, కుమార్తె దీక్షిత ఉన్నారు. నెల రోజుల క్రితం కుమార్తె మొదటి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. చందన్ యుకెజి చదువుతున్నాడు. మూర్తి తండ్రి సత్యనారాయణ కె.గంగవరంలో వ్యవసాయం చేస్తుంటారు. తణుకు ప్రాంతీయ ఆసుపత్రి మార్చురీ వద్దకు వచ్చిన మూర్తి అన్నయ్య, చెల్లెలు, బావ, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

విఆర్‌కు వెళ్లడానికి కారణాలు!

పని చేసిన అన్ని స్టేషన్లో మంచి పేరు తెచ్చుకున్న మూర్తి కేసుల సత్వర పరిష్కారం కోసం కృషి చేసే వారని సమాచారం. అత్తిలి మండలం బల్లిపాడు గ్రామానికి చెందిన ఆకుల మారుతి అయ్యన్నరావు వేల్పూరులో ఒక షెడ్డు అద్దెకు తీసుకుని గేదెల ఫారం నిర్వహిస్తున్నాడు. అయ్యన్నరావుకు చెందిన రెండు గేదెలు చోరీ కావడంతో నిందితునిగా భావించిన వీరభద్రపురానికి చెందిన బండి ఈశ్వరరావు నుంచి రికవరీ పేరుతో రూ.13 లక్షలు వసూలు చేసిన పోలీసులు బాధితుడికి మాత్రం కేవలం రూ.5 లక్షలు మాత్రమే అందజేసినట్లు సమాచారం. నగదు చేతులు మారుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం, బాధితునికి రికవరీ చేసిన నగదు పూర్తిగా ఇవ్వకపోవడంపై ఆరోపిస్తూ బాధితుడు మారుతీ అయ్యన్నరావు ఉన్నతాధికారులు ఫిర్యాదు చేయడంతో తాడేపల్లిగూడెం డిఎస్‌పి విశ్వనాథ్ గతేడాది నవంబర్ 18న విచారణ జరిపి తణుకు రూరల్ ఎస్‌ఐగా ఉన్న ఎజిఎస్.మూర్తి, ఎఎస్‌ఐ అంజిబాబులను విఆర్‌కు పంపించారు. అయితే ఎస్‌ఐ మూర్తి రాత్రంతా కుటుంబ సభ్యులతో గడిపినట్లు, ఏదో విషయమై మదన పడుతున్నట్లు కన్పించారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. శాఖాపరంగా ఉన్నతాధికారులు లేక రాజకీయపరంగా ఏమైనా ఒత్తిడి ఎదుర్కొంటున్నారా అని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో వైరలైన వీడియోలో ఎస్‌ఐ కన్పించకపోయినా ఎస్‌ఐను కార్నర్ చేశారని, విఆర్‌కు వెళ్లాల్సి వచ్చిందని మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారా అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఏదేమైనా ఆత్మహత్యకు కారణాలేమిటనేది పోలీసు విచారణలో తేలాల్సి ఉంది.



తణుకు ఆస్పత్రి వద్ద రోదిస్తున్న ఎస్‌ఐ బంధువులు (ఇన్‌సెట్లో ఎస్‌ఐ మూర్తి)

డిఎస్‌పితో విచారణ: ఎస్‌పి

విఆర్‌లో ఉన్న ఎస్‌ఐ మూర్తి మృతికి కారణాలపై డిఎస్‌పి స్థాయి అధికారులతో పూర్తిస్థాయి విచారణ జరుపుతామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. సంఘటన జరిగిన తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆపై తణుకు ఆసుపత్రిలో మార్చురీలో భద్రపరిచిన మూర్తి మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులు తగిన న్యాయం చేస్తామని, అండగా ఉంటామని తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షులు కోటయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పది నుంచి 15 ఏళ్లుగా పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వాలు మారినప్పుడల్లా తొలగించడం అన్యాయమన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం కూడా ఇదే రకంగా ఫీల్డ్ అసిస్టెంట్లను రాజకీయ వేధింపులతో తొలగించిందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రేపు ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి నిధుల కేటాయింపులు పెంచాలని కోరారు. ఉపాధి హామీ చట్టం విజయవంతంగా అమలు చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి శివకృష్ణ, సతీష్, సురేష్, పశ్చిమగోదావరి జిల్లా నాయకులు వెంకటేశ్వరరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి


నిర్వాసితుల ర్యాలీ, వినతి
అఖిలపక్ష పార్టీల మద్దతు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

తమ సమస్యలు పరిష్కరించాలని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు తహశీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. నిర్వాసితులకు సిపిఎం, సిపిఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినప్పటి నుంచి అవస్థలు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రతి ఏడాది గోదావరి వరదలకు కొండగుట్టల్లో తలదాచుకొని నరకయాతన అనుభవిస్తున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు మొదటి నిర్మాణ దశలో భాగంగా 17 గ్రామాలకు గత ప్రభుత్వ హయాంలో అరకొర పరిహారాలు చెల్లించగా ఇప్పటి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తరువాత 17 గ్రామాలకు పరిహారం చెల్లించిందన్నారు. మొదట ప్రయారిటీ ఇచ్చి 17 గ్రామాలు కాకుండా 14 గ్రామాలను మొదటి దశలో కలపాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. వరదలో మునిగిపోయే గ్రామాల్లో నిర్వాసితులు చాగరపల్లి, తాట్కూరు గొమ్ము కాలనీ, శుద్ధ గుంపు కొర్రాజులగూడెం, గీగావారి గుంపు గ్రామాల ప్రజలు


వినతిపత్రం అందిస్తున్న నిర్వాసితులు

స్వచ్ఛందంగా కదిలి మండలంలోని స్థానిక హాస్పిటల్ కాలనీ నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు సుమారు 1500 మంది నిర్వాసితులు ర్యాలీ నిర్వహించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్వాసితుల బాధను అర్థం చేసుకొని చాగరపల్లి, కొర్రాజులగూడెం, గీగావారి గుంపు, తాట్కూరు గొమ్ము కాలనీ, ఎర్ర బోరు, నడిమిగొమ్ము కాలనీ, పడమటి మెట్ట, మద్దిగట్ల వసంతవాడ శివకాశి పురం, పాత పూచిరాల గ్రామాలను సైతం మొదటి కాంటూరు పరిధిలోకి తీసుకొని తమకు న్యాయం చేయాలని నిర్వాసితులు కోరారు. తాట్కూర్ గొమ్ము పరిధిలోని 385, 174, 178 సర్వే నెంబర్ల పొలాలకు ప్యాకేజీ ఇవ్వలేదని, పోడు భూములకు, గిరిజనులకు భూమికి భూమి, అలాగే చల్లా వారి గూడెంలో నిర్వాసితులకు ఇస్తానన్న ఇళ్లకు సైతం రిజిస్ట్రేషన్ చేయించి పట్టాలు ఇప్పించి, అలాగే 18 నిండిన యువతకు కట్ ఆఫ్ తేదీతో సంబంధం లేకుండా పునరావాస కాలనీకి తరలించిన అప్పటి వరకే పరిగణించి వారికి కూడా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేసి ప్రభుత్వం నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆర్ఐ.భుజంగరావుకు వినతిపత్రం అందించారు. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు న్యాయం జరగాలని అఖిలపక్ష పార్టీలు మద్దతు తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, సిపిఎం మండల నాయకులు మడివి దుర్గారావు, సిపిఐ మండల కార్యదర్శి బాడిస రాము, సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు ఎండి మునీర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, కారం ధర్మయ్య, వైసిపి నాయకులు కామినేని వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు గుజ్జా రామలక్ష్మి, కొమ్మరాజు రాంబాబు, సిపిఐఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కట్టం ముత్యాలరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు సోడే సీతారామయ్య, సిహెచ్.వెంకన్నబాబు, ఆదివాసీ రక్షణ సమితి అధ్యక్షులు మోత్కు రాంబాబు, పీసా కమిటీ సభ్యులు తెల్లం మహేష్ తోడం సీతమ్మ, చాగరపల్లి గ్రామ కమిటీ సభ్యులు కాకా నరేష్, కారం కామయ్య,, దేవయ్య తదితర నిర్వాసితులు పాల్గొన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

ప్రత్తిపాడు అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - మండవల్లి

అగ్ని ప్రమాదం సంభవించి సర్వస్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తక్షణమే స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, శ్రీనివాసులు కోరారు. మండలంలోని ప్రత్తిపాడులో ఇటీవల అగ్నిప్రమాదం సంభవించిన ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించి బాధితులతో మాట్లాడారు. గత 30 ఏళ్లగా పూరిళ్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నామని బాధితులు వారికి తెలిపారు. చెరువుపైన వాలే పిట్టలను వేటాడడంతోనే జీవనోపాధిగా చేసుకుని 20 కుటుంబాలకు చెందిన వారు జీవిస్తున్నామని వారి దృష్టికి తీసుకొచ్చారు. అగ్ని ప్రమాదం వారి కుటుంబాల్లో పెద్ద విషాదాన్ని నింపిందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లడికి పాలు వేడి చేసే క్రమంలో ప్రమాదవశాత్తూ నిప్పురవ్వలు పడి పూరిళ్లు క్షణాల్లో కాలి బూడిదైపోయాయని వారికి వివరించారు. అగ్ని ప్రమాదంలో బట్టలతో పాటు టివిలు, మంచాలు వంట సామగ్రితో పాటు డబ్బులు, సెల్‌ఫోన్లు మంటల్లో కాలిపోయాయని వారికి చెప్పారు. ఆ మంటల్లో ఒకే కుటుంబానికి చెందిన చిన్నవాటితో పాటు మహిళా మరో నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారని వారికి వివరించారు. వారిలో ఒక వ్యక్తి మాత్రమే మిగిలి ఉన్నాడని, అతని పరిస్థితి కూడా విషమంగానే ఉందని వారి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని వారిని బాధితులు వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇళ్ల స్థలం కేటాయించి పూర్తిస్థాయిలో ఇల్లు నిర్మించి అందించాలని డిమాండ్ చేశారు.

ఎంఎల్‌సి ఎన్నికల నోడల్ అధికారుల నియామకం

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా ఏలూరు జిల్లాలో ఎన్నికల కోడ్ ప్రారంభమైన నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు నోడల్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు లాఅండ్ ఆర్డర్, జిల్లా భద్రతా ప్రణాళిక (జిల్లా ఎస్‌పి), మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు, బ్యాలెట్ బాక్సులు (జెడ్‌పి సిఇఒ), ఫస్టు ఎయిడ్ సెంటర్స్, కోవిడ్ నిబంధనల అమలు (డిఎంహెచ్‌ఒ), ఎన్నికల సిబ్బంది నియామక వివరాలు (డిఇఒ), ఎన్నికల శిక్షణా కార్యక్రమాల నిర్వహణ (జెడ్‌పి డిప్యూటీ సిఇఒ, డ్వామా పీడీ), రవాణా నిర్వహణ (డిటిసి), ర్యాండమైజేషన్ వెబ్ కాస్టింగ్, సైబర్ సెక్యూరిటీ, ఐటి సంబంధ అంశాలు (జిల్లా ఇన్ఫర్మేటిక్ ఆఫీసరు (ఎన్‌ఐసి), ఎడిఇఒ (ఇడిఎం), రిపోర్టులు (సివిల్ సప్లయిస్ ఎస్‌డిసి), పోస్టల్ బ్యాలెట్ పేపర్ (ఎస్‌సి కార్పొరేషన్ ఇడి), బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ (ట్రైబల్ వెల్ఫేర్ ఎస్ డిసి), మీడియా (డిఐపిఆర్‌ఒ), ఓటర్ల జాబితా (డిఆర్‌ఒ), ఎన్నికల పరిశీలకులకు ఏర్పాట్లు (జిల్లా ఎక్సైజ్ అధికారి, ఏలూరు ఆర్‌డిఒ), పోలింగ్ సిబ్బంది వెల్ఫేర్ మేనేజ్‌మెంట్ (జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్), వసతుల కల్పన (ఎస్‌ఇ పంచాయితీరాజ్), కాల్ సెంటర్, ఫిర్యాదుల పరిష్కారం (జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి), హెల్ప్ డెస్క్ (వయోజన విద్యా డిప్యూటీ డైరెక్టర్)లకు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రతిఒక్కరూ ఎంఎల్‌సి ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని ఎంపిడిఒ మణికుమారి తెలిపారు. మండలంలోని ఎపిగుంట, తిరుమలదేవిపేట, బొర్రంపాలెం గ్రామాల్లో ఎన్నికల నియమావళి అమలు తీరును శుక్రవారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసు గు వేయించి ప్లెక్సీలు తొలగించినట్లు ఆమె తెలిపారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని ఆమె తెలిపారు.

నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తా

జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ

ప్రజాశక్తి - పోలవరం

నిర్వాసితుల సమస్యలు సత్వరమే పరిష్కరిస్తామని జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ అన్నారు. పోలవరం తహశీల్దార్ కార్యాలయంలో పునరావాస గ్రామాల నిర్వాసితులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలి దశలో తరలించిన గ్రామాలైన పైడిపాక, చేగొండపల్లి, దేవరగొంది, మామిడిగొంది గ్రామాల నిర్వాసితుల ఆర్అండ్ఆర్ సమస్యలపై వివరాలు సేకరించారు. పరిహారాలు సంబంధిత సమస్యలపై విచారించి నిర్వాసితులకు తగు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సాయిరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ విజిట్‌కు ఆర్‌జియుకెటి విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ఇసిఇ విభాగానికి చెందిన 80 మంది విద్యార్థులు మంగళవారం మంగళగిరిలోని ఎఫెక్ట్రానిక్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీని సందర్శించారు. ఇండస్ట్రియల్ విజిట్ ద్వారా విద్యార్థులకు ఇండస్ట్రీలో జరుగుతున్న అంశాలు, విద్యార్థులు నేర్చుకోవాల్సిన అంశాలపైన అవగాహన పెంపొందిస్తాయి. ఈ కార్యక్రమంలో డీన్ ఇటిపి శ్యామ్, శ్రీకాకుళం నూజివీడు హెచ్‌ఒడిలు, శ్రీకాకుళం డిప్యూటీ ఎఒ సతీష్, ఇసిఇ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఫీజు పోరు చేసే అర్హత వైసిపికి లేదు'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఫీజు పోరు కార్యక్రమం చేసే అర్హత వైసిపికి లేదని టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు మహేష్‌యాదవ్ అన్నారు. ఏలూరులోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ గతంలో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విద్యాదీవెనగా మార్చి తామేదో కొత్తగా ఈ పథకాన్ని సృష్టించినట్లు జగన్ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో విద్యార్థుల తరపున పూర్తి ఫీజులు నేరుగా కళాశాల యాజమాన్యాలకే ప్రభుత్వం అందించేదని, జగన్మోహన్ రెడ్డి మాత్రం ప్రచార ఆర్భాటంతో విద్యాదీవెన అంటూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేశారన్నారు. ఇచ్చే విద్యాదీవెన కూడా కళాశాలకు సమయానికి వేయకపోవడంతో కొన్నిచోట్ల హాల్ టికెట్లు నిలిపివేసి పరీక్షలు రాయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ చేస్తే జగన్మోహన్ రెడ్డి తొమ్మిది లక్షల మందికి మాత్రమే విడతల వారీగా విద్యార్థులకు ఇచ్చి మోసగించారన్నారు. అయితే ఇప్పటికే కూటమి ప్రభుత్వం రూ.788 కోట్లు ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసిందని తెలిపారు. విద్యార్థులను ఫీజుల కోసం ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని కాలేజీలకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి కొమ్మరెడ్డి మణికంఠ, ఏలూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మారం సూర్య పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో ఇఎస్‌టిఎఫ్ సిబ్బంది శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో ఇస్లావతు రాము అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, అతనిపై అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఇఎస్‌టిఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కెఎండి.అరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రై డేతో దోమల వృద్ధికి అడ్డుకట్ట

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దోమల వృద్ధిని అరికట్టాలంటే ప్రతిఒక్కరూ డ్రైడే ఆచరించాలని, అప్పుడే దోమల ద్వారా వచ్చే అంటువ్యాధుల నుంచి కొంతవరకు తప్పించుకోవచ్చని జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ సూచించారు. స్థానిక ఏలూరు పట్టణ ఆరోగ్య కేంద్రం గజ్జలవారిచెరువు సచివాలయ పరిధిలో, బెనర్జీపేటలో డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ అపరిశుభ్ర పరిసరాల వల్ల దోమలు ఎక్కువగా వృద్ధి చెంది, తద్వారా ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. దోమకాటు కంటికి కనిపించదని, కాని దాని ద్వారా ముప్పు చాలా ఉందని, ప్రజలు దోమల నిర్మూలనలో భాగస్వామ్యం కావాలని సూచించారు. అప్పుడే దోమల ద్వారా వచ్చే వ్యాధులు అరికట్టవచ్చని, నీళ్ల తొట్టెలు కనీసం వారానికి ఒక్కసారైనా శుభ్రపరచుకుని మూతలు పెట్టుకోవాలని తెలిపారు. నీరు నిల్వ ప్రాంతాల్లో వాడేసిన ఇంజన్ ఆయిల్‌ను చల్లాలని, సాయంత్రం సమయంలో కిటికీలు వేసుకోవాలని, దోమతెరలు వాడాలని, ఇళ్లల్లో వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. శీతాకాలంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మురికి కాలువల్లో చెత్త వేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, ఆరోగ్య కార్యకర్తలు మహాలక్ష్మి, గంగాభవాని, శాంతి ప్రియ, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో జీలుగుమిల్లి మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసి, ఫ్లెక్సీలను తొలగిస్తున్నట్లు ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి తెలిపారు. జీలుగుమిల్లిలో ఇటీవల ఫ్లెక్సీలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడంతో పంచాయతీ సిబ్బందితో పాటు సచివాలయ సిబ్బందిని కూడా నియమించి ఎక్కడ కూడా ఎటువంటి రాజకీయ నాయకుల ప్రకటనలు లేకుండా తొలగించనున్నట్లు ఆమె తెలిపారు. రాజకీయ నాయకుల ఇళ్ల వద్ద ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

జగదాంబ ఆలయ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి ప్రధాన రహదారిపై ఉన్న జగదాంబ ఆలయ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అన్నారు. జనసేన నాయకులు గడ్డమనుగు రవి ఇంటి వద్ద శుక్రవారం నిర్వహించిన జగదాంబ ఆలయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే జగదాంబ ఆలయ కమిటీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. అనంతరం నూతన ఆలయ ఉత్సవ కమిటీని నియమించారు. ఈ కార్యక్రమంలో జనసేన అధికార ప్రతినిధి జి.రవికుమార్, చిర్రి వెంకటేశ్వరరావు, ప్రసాద్, శ్రీను, మధు, ధర్మరాజు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

తలమాడు తెగులును నివారిస్తే అధిక దిగుబడులు

ప్రజాశక్తి - మండవల్లి

తలమాడు తెగులును సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జె.వెంకటమణి స్పష్టం చేశారు. మండలంలోని పెరికేగూడెంలో రైతులతో కలిసి మినుము పైరును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినుము పైరుకు తలమాడు తెగులు ఆశించిందన్నారు. తామర పురుగు ఉధృతి వల్ల ఈ తెగులు వస్తుందన్నారు. తలమాడు తెగులు నివారించడానికి ముందుగా తామర పురుగును నియంత్రించుకోవాలన్నారు. ఐదు గ్రాముల వేప గింజల కషాయాన్ని పైరుపై దఫాల వారీగా పిచికారీ చేసి తామర పురుగును నివారించుకోవాలన్నారు. అజాడీ రాక్టిన్ వేప సంబంధిత పురుగుమందును 500 మిల్లీగ్రాముల పిచికారీ చేసి కూడా పురుగును అదుపులో ఉంచుకోవచ్చన్నారు. అంతేకాకుండా ఎసిఫేట్ ఎకరానికి 200 గ్రాములు పిచికారీ చేసుకోవచ్చన్నారు. రబీలో వేసిన పంటకు ఇ-క్రాప్ట్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. రైతులకు భూసార ఫలితాల రికార్డులను అందించారు. అనంతరం మినుము పైరు రైతులకు 50 శాతం రాయితీతో పురుగు మందులను అందించారు.

'లక్ష డప్పులు, వెయ్యి గొంతుకలు' జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - చాట్రాయి

పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ ఫిబ్రవరి ఏడో తేదీన నిర్వహిస్తున్న లక్ష డప్పులు, వెయ్యి గొంతుకలు అనే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకుడు గార్లపాటి మారేష్ అన్నారు. ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ ప్రభుత్వం ప్రకటించిన సందర్భంగా చాట్రాయి మండలంలోని ఆరుగొలనుపేటలో కార్యక్రమం నిర్వహించారు. కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండలాధ్యక్షుడు మోలుగుమాటి రవిరాం, కోట జోషి, కలపాల రమేష్, కొప్పుల ప్రసాద్‌బాబు, దేవరపల్లి జయరాజు, కొమ్ము. ప్రసాద్, చౌటుపల్లి రాంబాబు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లకు అందరూ సహకరించాలి

నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని పార్టీలకు చెందిన నాయకులు, అన్ని తరగతుల ప్రజలు కృష్ణ, గుంటూరు పట్టభద్రుల ఎన్నికలకు సహకరించాలని సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ సూచించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులతో సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ మాట్లాడుతూ ఫిబ్రవరి మూడో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు. ఔత్సాహిక అభ్యర్థులు వచ్చే నెల పదో తేదీ లోపు నామినేషన్ దాఖలు చేయవచ్చన్నారు. 11వ తేదీన నామినేషన్ పరిశీలన, 13వ తేదీన నామినేషన్ ఉపసంహరణకు ఆఖరి గడువుగా తెలిపారు. ఎన్నికలు ఫిబ్రవరి 27వ తేదీన ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. మార్చి మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని, ఎన్నికల నియమావళి మార్చి ఎనిమిదో తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఎన్నికల నియమావళి అమలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు ఎలాంటి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయకూడదన్నారు. ప్రజా ప్రతినిధుల వ్యక్తిగత పర్యటనలను ఎన్నికల కార్యక్రమాలతో కలుపుకోకూడదని సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా కొనసాగేలా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండలాధ్యక్షులు ముసునూరు రాజా, జనసేన పార్టీ యువనేత ముత్యాల కామేష్, వైసిపి పట్టణ అధ్యక్షులు శీలం రాము, సిపిఎం డివిజన్ కార్యదర్శి జి.రాజు, బిజెపి పట్టణ అధ్యక్షులు బోస్ అప్పారావు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ ఆంజనేయులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పాడి రైతుల సంక్షేమ అభివృద్ధికి కృషి చేస్తానని కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని గురజ పాల ఉత్పత్తి దారుల పరస్పర సహాయక సహకార సంఘాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాల ఉత్పత్తిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాల ఉత్పత్తిదారులకు మేలైన యాజమాన్య పద్ధతులు, మెరుగైన పశుపోషణకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ 60 ఏళ్ల వజ్రోత్సవల్లో భాగంగా గురజ గ్రామంలో ఉన్న ఈ సొసైటీని 1969లో 24 మంది పాల ఉత్పత్తి దారులతో స్థాపించి రోజుకు 60 లీటర్ల పాలతో ప్రారంభమై దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం 140 మంది పాల ఉత్పత్తిదారులతో రోజుకు 600 లీటర్లు సేకరిస్తు చక్కటి అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. లీటర్ పాల ధర 40 పైసలతో ప్రారంభించి ప్రస్తుతం యూనియన్ బోనస్, సంఘ బోనస్‌తో కలుపుకుని సగటున గేద పాలకు రూ.64, ఆవు పాలకు రూ.41 చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గత 50 ఏళ్లుగా సొసైటీకి పాలు పోస్తూ కృష్ణా మిల్క్ యూనియన్‌తో మమేకమైన కుటుంబ సభ్యులను ఛైర్మన్ ఆంజనేయులు శాలువాలతో సత్కరించారు. పాడి రైతుల లాభాల కోసం రైతుల కష్టానికి ప్రతిఫలం ఇవ్వడానికి పాల ధరను, బోనసును పెంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ పాలక వర్గ సభ్యులు వల్లభనేని భాస్కర కుటుంబ వెంకట సుబ్బారావు, పెదన జెడ్‌పిటిసి సభ్యులు అర్జా వెంకట నగేష్, ట్రస్ట్ బోర్డు సభ్యులు కాగిత జయరామ్, ఫీడ్ కమిటీ సభ్యులు మోతుకూరి వెంకటేశ్వరరావు, గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సంఘ అధ్యక్షురాలు ఉప్పలపాటి శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ చొప్పకట్ల వరప్రసాద్, వేతన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, పాలక వర్గ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు హెచ్‌ఎం నాగేశ్వరరావు

ప్రజాశక్తి - చాట్రాయి

పోలవరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొల్లమందల నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భాన్ని పరస్కరించుకుని పోలవరం పాఠశాలలో శుక్రవారం ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్.ముఖర్జీ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మరిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా, గణిత శాస్త్ర ఉపాధ్యాయులుగా బాధ్యతలను సక్రమంగా నిర్వహించారన్నారు. పదో తరగతిలో మండలంలోని పాఠశాలల కంటే ఎక్కువ ఉత్తీర్ణత శాతాన్ని పెంచారన్నారు. గ్రామంలో ఉపాధ్యాయునిగా మంచి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. అనంతరం శాలువాలతో ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ ఎస్.రాంబాబు, యుటిఎఫ్ నాయకులు వీరకోటి సూర్యనారాయణ, రత్తయ్య, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌరవ వేతనాలు ఇవ్వాలని బిఎల్‌ఒల వినతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఏళ్ల తరబడి పెండింగులో ఉన్న గౌరవ వేతనాలు తక్షణమే తమకు ఇవ్వాలని బూత్ లెవెల్ అధికారులు (బిఎల్‌ఒలు) కోరారు. ప్రతి నెలా రూ.500 గౌరవ వేతనం అందిస్తామని అధికారులు చెప్పడంతో తాము బిఎల్ ఒలుగా విధులు నిర్వర్తించినట్లు పేర్కొన్నారు. 2021 నుంచి ఇప్పటివరకు గౌరవ వేతనాలు అందలేదని వాపోయారు. ఇదే విషయం మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డిని బిఎల్‌ఒలు కోరగా సూపర్‌వైజర్లు నివేదికలు అందిస్తే, ఎక్విటెన్స్ తయారు చేసి ఫైలు రెవెన్యూ అధికారులకు పంపేందుకు తనకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. తమ పరిధిలో విధుల కేటాయింపు, అక్విటెన్స్ తయారీ మాత్రమే ఉంటాయన్నారు. గౌరవ వేతనాలు, నిధుల విడుదల వంటి కార్యక్రమాలు రెవెన్యూ శాఖ ఆధీనంలో ఉంటాయని వివరించారు. ఆ మేరకు ఆ శాఖకు చెందిన అధికారులను బిఎల్‌ఒలు కోరాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రశాంత ఉద్యోగ విరమణ ఆరోగ్యానికి సోపానం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రశాంతంగా ఉద్యోగ విరమణ చేయడం ఆరోగ్యానికి సోపానమని ఎంపిడిఒ వై.రామకృష్ణ అన్నారు. ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా ఉద్యోగ విరమణ చేసిన కోడూరు వీరదుర్గాప్రసాద్ దంపతులను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపిడిఒ రామకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి అశోక్, ఎఒ రమణారావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పశువులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ముగిసిన పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో జరుగుతున్న పశు ఆరోగ్య ఉచిత వైద్య శిబిరాలు ముగిశాయి. ఈ నెల 20వ తేదీన ప్రారంభమైన శిబిరాలు 12 రోజుల పాటు మండల వ్యాప్తంగా 32 గ్రామపంచాయతీల్లో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరాల్లో ముదినేపల్లి, ప్రొద్దువాక వెటర్నరీ డిస్పెన్సరీల పశు వైద్యాధికారులు యు.క్రాంత్‌కుమార్, ఆరేపల్లి రామకృష్ణ పాల్గొని పశువులకు, జీవాలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం మండలంలోని వణుదుర్రు, సింగరాయపాలెం గ్రామాల్లో నిర్వహించిన పశు వైద్య శిబిరాల్లో పశువులకు, గేదెలకు, కృత్రిమ గర్భధారణ, గేదెలకు సూడి పరీక్షలు, గేదెలకు, గొర్రెలకు నట్టలు నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది బి.వెంకటేశ్వరరావు, కె.మాణిక్యాలరావు బి.సోమేశ్వరవర్మ, బి.శ్రీనివాసరావు, జోజిబాబు, జె.రవి, దుర్గారావు, మల్లెబాబు, సిహెచ్.రత్నకుమార్, శేఖర్‌బాబు పాల్గొన్నారు.